# మానవత్వం - మనిషి తత్వం

జియా మోహన్

నియాన్ లైట్ల క్రింద దివ్యంగా వెలిగిపోతున్నది హోటల్ 'ఉదయశంకర్'. ఆ లైట్ల వెలుగులో తన చోటు చూసుకొని ముడుచుకు కూర్చున్నాడు వీరయ్య.

నాలుగు రోజుల్నుంచి పస్తులున్న కడుపు తనని నింపమని మారాం చేస్తున్నది. "నాల్రోజుల్నుంచి కప్పు టీ నీళ్ళకూడా పైసలు రాల్చలేదు మారాజులు!" అని గొణుక్కున్నాడు.

సర్రున దూసుకు వచ్చి ఠీవిగా ఆగింది ఇంపాలా కారు.

కళ్ళు చిట్లించుకొని చూశాడు వీరయ్య. హుందాగా నలుగురు ఖరీదయిన మనుషులు కార్లోంచి దిగటం చూసి, కొంచెం ముందుకు జరిగి చేతులు జాపాడు వీరయ్య. ముగ్గురూ ముఖం చిట్లించుకొని సిగరెట్ పొగ వీరయ్య మీదకు వదిలి ముందుకు కదిలారు. ప్రసాద్ కారు లాక్ చేసి కీ ఛెయిన్ విలాసంగా తిప్పుకుంటూ లోపలకు నడిచాడు. 'అ....అ....' కడుపు చేత్తో పట్టుకొని ఆకలని సైగ చేస్తున్న వీరయ్యవంక చూసీ చూడనట్లు అడుగు ముందు కేశాడు.

'యా....యా....' ప్రసాద్ ముందుకు వెళ్ళి చేయి జాచాడు వీరయ్య.

వీడిలా వెంటబడుతున్నాడేమిటా అని విసుక్కుంటూ జేబులోకి చేయి పోనిచ్చాడు.

కళ్ళు విప్పార్చుకొని ఆశగా చూస్తున్నాడు వీరయ్య.

మెత్తని నోట్లు చేతికి తగిలాయి. ఇంకా రెండు మూడు జేబులు వెతికాడు. ఎక్కడా చిల్లర తగల్లేదు. నాలుగు రోజుల్నుంచి అంటున్న పదమే మళ్ళీ పలికాడు.

"ప్చ్.... చిల్లర లేదు. సారీ!" వీరయ్య ముఖంలోకి సరిగ్గా చూడలేక లోపలికి నడిచాడు ప్రసాద్.

'ఆ....యా....' మూగ గొంతుతో అరుస్తూ ఇంకొంచెం ముందుకు వెళ్ళాడు.

"అవతలికి పో!" ఘూంకరించాడు గూర్ఖా.

నిస్సహాయంగా, కనుమరుగవుతున్న ప్రసాద్ వంక ఒకసారి చూసి తన చోటులోకి వచ్చి కూర్చున్నాడు వీరయ్య.

అతను ఆకలి బాధ భరించలేక పోతున్నాడు. కడుపులో నరాలన్నీ బిగదీస్తునాయి. ప్రాణం పోతున్నట్లుగా వుంది. ధారాపాతంగా కారుతున్న కన్నీటిని చినిగిన చొక్కాతో తుడుచుకుంటూ అనుకున్నాడు.

"అయ్యా! డబ్బున్న దొరలూ! నేను డబ్బులేనివాణ్ణి. ముష్టివాణ్ణి. మూగవాణ్ణి. అందరిలా బాధను వ్యక్తం చెయ్యటానికి నాకు భాష లేదు. నాలుగు రోజుల్నుంచి పస్తులున్నాను. కడుపు ఖాళీగా వుంది. ప్రాణం పోయే బాధగా వుంది. వందలు వందలు ఖర్చు చేస్తూ ఇక్కడ తినటానికి వస్తున్నారు మీరు. ఒక్క పది పైసలు నాకు రాల్చలేకపోతున్నారా అయ్యా! గుక్కెడు టీ నీళ్ళతో ప్రాణం నిలబెట్టుకోవాలనుకుంటున్నాను నేను. నా ముఖం చూసి ఓ పది పైసలన్నా దానం చెయ్యండి బాబూ!"

మనసులో అనుకుంటున్న వీరయ్యకి ఒక్కసారిగా దుఃఖం పొంగి పొర్లింది. నోట్లో గుడ్డ కుక్కుకొని వెక్కిళ్ళు పెడుతూ కళ్ళు తుడుచుకున్నాడు.

"ఊర్కోరా వీరయ్యా! మన అదురుష్టమే అలాంటిది. నీ పానం అసలే బాగా లేదు. ఊర్కోన్నా వూర్కో!" పక్కనే కూర్చున్న మరొక ముష్టివాడు వీరయ్యను ఓదార్చాడు.

"ఆకలిగా వుందిరా!" తన గాజు కళ్ళతో అతణ్ణి చూస్తూ సైగ చేశాడు వీరయ్య.

"నాదగ్గర పావలావుంది. టీకి వెళ్దాద్దామా?"

ఆశగా తలూపాడు వీరయ్య.

"అయితే....లే, ఇదో నా చెయ్యి పట్టుకో!" వీరయ్య అతని కుడిచేతిని పట్టుకొని లేచాడు. ఎడంచెయ్యి బనీనులోంచి వేలాడుతున్నది జాలిగా.

ఒక అవిటివాడు ఒక మూగవాడికి టీ ఇప్పిస్తున్నాడు. మనసు ద్రవించించి వీరయ్యకి. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"సీ! మన బతుకులే శండాలపు బతుకులు!"

అవునన్నట్లుగా చల్లటిగాలి శరీరానికి తగిలింది.

నలుగురికి డిన్నర్ ఆర్డరిచ్చి ఆ ఎయిర్ కండిషన్ గదిలో చల్లగా కూర్చున్నాడు ప్రసాద్.

"డిన్నరొచ్చేలోపల డ్రింకేదయినా పుచ్చుకుంటే...." మొదటతను అన్నాడు.

"ష్యూర్....ష్యూర్!" సర్వర్‌ని పిలిచి మూడు వంద రూపాయల నోట్లిచ్చి ఖరీదయిన 'బ్లాక్ డాగ్' ను తెమ్మన్నాడు ప్రసాద్.

"ఎలా అయినా మన ప్రసాద్ పిల్ల జమీందారే!" రెండో అతను వెకిలిగా నవ్వాడు.

"ఆఁ—నువ్విప్పుడేం చూశావ్! అడిగినవాడికి లేదనడు. ఆ చేతికి ఎముకే లేదనుకో!" సిగరెట్ అంటిస్తూ అన్నాడు మూడో పెద్దమనిషి.

అదేదో హిట్టయిన విట్టయినట్లు ఒక్కసారిగా పెద్దగా నవ్వారు వాళ్ళు. చిరునవ్వుతో వింటున్న ప్రసాద్‌కి చటుక్కున గుర్తుకొచ్చాడు వీరయ్య. చేదు తిన్నట్లుగా అయింది అతని ముఖం.

"వాట్ హ్యాపెండ్....అలా అయ్యావేమిటి? ఒంట్లో బాగుండ్లేదా?" కంగారుగా అడిగారు తక్కిన ఇద్దరూ.

"నో....నో.... అయామ్ ఆల్‌రైట్!" కొంచెం సర్దుకు కూర్చున్నాడు ప్రసాద్.

ఆ స్కాచ్ విస్కీ సీసా, నాలుగు గాజు గ్లాసులు, సోడాలు, మధ్యమధ్యలో తినటానికి జీడి పప్పు, చిప్స్ ప్లేట్లు చక్కటి ట్రేలో సర్ది తీసుకు వచ్చాడు సర్వర్.

మిగతా చిల్లర ఇవ్వబోతుంటే వుంచుకోమని చేయి వూపాడు ప్రసాద్.

"చియర్స్" అందరి చేతుల్లో గ్లాసులు ఒక చోటికి వచ్చి వింత శబ్దం అయింది.

"మన ప్రసాద్ ఆరోగ్యం కోసం:" వాళ్ళల్లో ఒకతను అన్నాడు.

బలవంతంగా నవ్వాడు ప్రసాద్.

నోటి దగ్గర గ్లాసులో వీరయ్య ముఖం వికారంగా కన్పించింది.

గ్లాసు పట్టుకున్న అతని చేయి వణికింది.




వేడి వేడి టీ తాగితే ఆకలి కడుపు ఆరవదను కున్నాడు వీరయ్య.

ఒక్కొక్క చుక్క లోపలకు వెళ్తుంటే నరాలు ఆ వేడికి తట్టుకోలేకపోయాయి. భళ్ళున వాంతి చేసుకున్నాడు అతను.

"ఏం అన్నా ఏందిరా?" తన ఒక్క చేత్తో వీరయ్య గుండెల మీద రాస్తూ అడిగాడు అవిటివాడు. వికారంగా ముఖం పెట్టాడు వీరయ్య.

"ఇకారంగా వుందా?"

తలూపాడు వీరయ్య.

"పద పోదాం. నీ చోట్లో కూచుందువు గాని...." వాణ్ణి నడిపించుకుంటూ తీసుకు వచ్చాడు అతను. ముడుచుకు పడుకున్నాడు వీరయ్య.

"మన బతుకులు ఎలా ఎల్తాయో ఏటో?" అన్నాడు అవిటివాడు.

"అంతా ఆ భగవంతుడి దయ!" రెండు చేతులూ పైకెత్తి ఆకాశం వంక చూపించాడు వీరయ్య.

చూశాడు ప్రసాద్. పైన వెలుగుతున్న నీలం రంగు లైట్లలో నీరసంగా కనిపించాడు వీరయ్య-మూగ భాషతో ఏదో సైగ చేస్తున్నాడు.

ఇక తాగలేకపోయాడు. విసురుగా శబ్దం అయేటట్లు గ్లాసుని టేబుల్ మీద పెట్టాడు.

"ఏమిటి ప్రసాద్? ఇందాకట్నుంచి అలా వున్నావేం? ఇంటి దగ్గర ఎంతో హుషారుగా బయల్దేరావు. ఇప్పుడేమయింది?" రెండో అతను అడిగాడు.

"ఏదైనా కథ చెబుతావా?" మూడో అతను వెకిలిగా నవ్వాడు.

"ఆఁ.... కథా.... చెప్పు....చెప్పు....ఇలాంటప్పుడు మంచి మంచి ప్రేమకథలు వస్తాయి." గారబట్టిన పళ్ళు పైకి కనబడేలా నవ్వాడు మరో పెద్దమనిషి.

"అవును....కథ చెప్పాలనే అనుకుంటున్నాను. అయితే ఇది మీరనుకున్నట్లు ప్రేమ కథ కాదు. ఒక ముష్టివాడి కథ....ఒక మూగ వాడి కథ." ఆవేశంగా అన్నాడు ప్రసాద్.

"అయితే ఇందాకట్నుంచి నువ్వు వాడి గురించి ఆలోచిస్తున్నావా? అసలు అలాంటి వాళ్ళందర్నీ ఊళ్ళోకి రానీయకూడదు. వాళ్ళవల్లే అనేక రోగాలు ప్రజలకు అంటుకుంటున్నాయి. కుక్కల్ని షూట్ చేసినట్లు వాళ్ళను చంపి పారెయ్యాలి. మన దేశంలో అహింసా, భూతదయా అంటూ ఉపన్యాసాలు చెప్పిచెప్పి ఇలా పనికిరాని వాళ్ళందర్నీ బ్రతికిస్తున్నారు గాని, అదేదో దేశంలో అయితే ముసలివాళ్ళను, ముష్టివాళ్ళను కాల్చి పారేస్తారట."

ఆ దేశమేదో చెప్పకుండా, అసలు అలాంటి దేశమేదైనా వుంటుందా అనైనా ఆలోచించకుండా మత్తెక్కి బండబారిన నాలుకతో అన్నాడు.

వాళ్ళను చూస్తుంటే మొదటిసారిగా అసహ్యం కలిగింది ప్రసాద్‌కు.

ఇంతలో డిన్నరొచ్చింది.

పది, పన్నెండు రకాల అయిటమ్స్‌లో స్వీట్స్‌తో చూడటానికి ఎంతో అందంగా వున్నాయి ఆ డిన్నరు ప్లేట్లు.

అందరూ ఆత్రంగా ముందుకు లాక్కొని కూర్చున్నారు.

నోటిదాకా వెళ్ళిన చేయి నోట్లోకి వెళ్ళలేదు. 'అక్కడ అతను పట్టెడు మెతుకులు లేక అల్లాడుతుంటే పంచభక్ష్య పరమాన్నాలతో తినే హక్కు తనకుందా?" ప్రశ్నించుకున్నాడు ప్రసాద్.

ఇక తినగూడదనుకున్నాడు. ఇంక తినలేనను కున్నాడు.

అతని మనసుని, మాటల్ని పట్టించుకోని అతని మిత్రులు బలవంతంచేసి ప్లేటుని ఖాళీ చేయించారు.

కడుపు నిండింది. మనసు శూన్యంగా మిగిలి పోయింది.

బిల్లు చెల్లించాడు. కొత్త అయిదు రూపాయల నోటు ప్లేటులో మెరుస్తున్నది.

అది తీసి జేబులో పెట్టుకొని నవ్వుతూ సెల్యూట్ చేశాడు సర్వర్.

మేడ దిగి కారు దగ్గరకి వచ్చి తాళం తీశాడు ప్రసాద్.

మనసు వీరయ్యను చూడాలని కోరుతున్నది. బలవంతంగా ఆ కోరికను అదిమిపెట్టి బలంగా యాక్సిలేటర్‌ను నొక్కాడు అతను.

ఆ ముగ్గుర్ని వాళ్ళ ఇళ్ళ దగ్గర దింపి అలసటగా కారులో కూర్చుండిపోయాడు. ఆ అలసట దేహానికి కాదు - మనసుకని అతనికి తెలుసు.

ఇప్పుడిప్పుడే ఇంటికి వెళ్ళాలని అతనికి అనిపించటంలేదు.

తన రాక కోసం ఎదురుచూసే భార్య కానీ, నాన్నొచ్చాడని గంతులేసే పిల్లలు కానీ ఇప్పుడతని దృష్టిలోలేరు.

వీరయ్యను చూడాలన్న ఆలోచనే అతని మనసులో చోటు చేసుకున్నది.

ప్రసాద్ కారు హోటల్ ఉదయశంకర్ వైపు కదిలింది.

అలవాటుగా వీరయ్య కూర్చునే చోటు చూస్తే వెలితిగా కనిపించింది.

ప్రసాద్‌కు చెప్పలేనంత నిరాశగా అనిపించి ప్రక్కన వున్న కిళ్ళీ కొట్టు అతణ్ణి అడిగాడు. అతని మాట ప్రకారం కారుని వేగంగా జనరల్ హాస్పిటల్‌కు పరుగు తీయించాడు ప్రసాద్. గేటు దగ్గర బిచ్చగాళ్ళు గూర్ఖాతో ఘర్షణ పడుతున్నారు.

సడన్‌బ్రేక్ వేసి గూర్ఖా చేతిలో చేతికొచ్చిన నోటు కుక్కి వీరయ్యను లోపలకు తీసుకెళ్ళి, డ్యూటీలో వున్న డాక్టరుకు అప్పగించి తృప్తిగా గాలి పీల్చాడు ప్రసాద్. ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు.

బాగా పొద్దెక్కాక కానీ మెలకువ రాలేదు ప్రసాద్‌కు.

వీరయ్యను చూసి రావాలని మనసు తొందర పెడ్తున్నది. 'వీరయ్యతో మాట్లాడి కొంచెం ఓపిక రాగానే తనింట్లో పనికి కుదుర్చుకుంటానని ధైర్యం చెప్పి రావాలి.'

నిశ్చయంగా అనుకొని హాస్పిటల్‌కు వెళ్లాడు.

ఎదురుగా కొత్త డాక్టరు కన్పించాడు. తనను తాను పరిచయం చేసుకొని వీరయ్య గురించి అడిగాడు.

"పదో నెంబరు బెడ్ కదూ?"

"సారీ! నాకు బెడ్ నెంబరు తెలియదు. అతను ఈ రూమ్‌లోనే వున్నాడని తెలుసు."

"అయితే లోపలకు వెళ్ళి చూడండి."

డాక్టరుకు కృతజ్ఞతలు చెప్పి లోపలకు వెళ్ళాడు ప్రసాద్.

ఒక్కొక్క బెడ్ దగ్గర ఆగి వీరయ్య అవునా, కాదా అని చూస్తుంటే దూరంగా నర్సు ఒక పేషెంటు మీద గుడ్డ కప్పటం చూసి అటు పరిగెత్తాడు.

"సిస్టర్ ఒక్కసారి ఆ గుడ్డ తీస్తారా? ఆ పేషెంటుని చూడాలి!" ఆత్రంగా అడిగాడు.

సూటూ బూటూ వేసుకున్న మనిషి ఒక ముష్టివాణ్ణి చూడాలనుకోవటం సిస్టర్‌కు ఆశ్చర్యమనిపించింది.

ముఖాన కప్పిన గుడ్డ తొలగింది.

వీరయ్య శాశ్వత నిద్రలో వున్నాడు. ఆ మూగ గొంతు పలుకలేనని సెలవు తీసుకున్నది. నిశ్చేష్టుడయ్యాడు ప్రసాద్.

"మీరు డబ్బున్న మారాజులు బాబూ! ముష్టి వాడికి పైసా దానం చెయ్యలేరు. సర్వర్లకు టిప్పు లంటూ పదులు, ఇరవైలూ ఇవ్వగలరు. వందలు వందలు ఖర్చు పెట్టి డబ్బున్న వాళ్ళకే డిన్నర్ల పేరుతో అన్నదానాలు చెయ్యగలరు. ముష్టివాడికి ఒక ముద్ద పడెయ్యలేరు. ఇదేం న్యాయం బాబూ! నాలుగురోజుల్నించి అడిగాను. ఒక్క పదిపైసలు రాల్చారా? ఎప్పుడూ మీ దగ్గర చిల్లరుండదు నాయనలారా!

"మీరు పచ్చగా పది కాలాలపాటు అలాగే బ్రతికుండాలి బాబయ్యా! మా బ్రతుకులిలాగే మట్టి కొట్టుకుపోతాయి. మీరు ఇలాగే మేడల్లో కులుకుతూ కూర్చోండి అయ్యల్లారా! మీ చదువు మీకు ఏం నేర్పింది? అయ్యా! మీరు డబ్బున్న మహరాజులు: అది మీరు చేసుకున్న పుణ్యం. మేము చేసుకున్న పాపానికి ఈ ముష్టి బతుకులు ఈడవాలి. ఇది మీ తప్పు కాదు బాబూ! కాని.... ఎంగిలి చెయ్యి కాకికి విదిల్చినట్లు....చిల్లర డబ్బులు మాకు ధర్మం చెయ్యండి. మేడల మీద మేడలు కట్టే మీరు అయిదు, పది పైసల్ని విదల్చక పోవటం న్యాయమేనా? ఇదేనా మీ మానవత్వం?" వీరయ్య నాలుగువైపుల్నించి అరుస్తున్నట్లుగా వుంది. తనని నిలదీస్తున్నట్లుగా వుంది.

ఉక్కిరిబిక్కిరిగా ఊపిరి అందక అల్లాడాడు ప్రసాద్.

అతని పరిస్థితి గమనిస్తున్న సిస్టర్ ఆదుర్దాగా అడిగింది.

'నథింగ్....నథింగ్....' నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ క్రిందకు దిగాడు.

పేవ్‌మెంటు మీద వీరయ్య శవం చుట్టూ తోటి బిచ్చగాళ్లు కూర్చొని గొంతెత్తి అరుస్తున్నారు.

'శవానికి ధర్మం చెయ్యండి బాబూ! అనాథకి ధర్మం చేస్తే పుణ్యం నాయనా!"

తోచినవాళ్ళు తోచినంత చిల్లర పడేస్తుంటే ప్రసాద్ జేబులో చేయి పెట్టాడు. చిల్లర లేదు. అలవాటు ప్రకారం మెత్తటి నోట్లే తగిలాయి.

గుప్పెడు నోట్లను వాళ్ళ చేతుల్లో పడేసి పక్కకు తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ తరువాత....ప్రసాద్ జేబులో చిల్లర డబ్బులు ఎప్పుడూ గలగలలాడుతూ వుండటం చాలామందికి ఆశ్చర్యాన్ని కల్గించింది.... □

# పుస్తకాలు

## సూర్యముఖి

(నవల)

[రచన: అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి; క్రౌను 1/8 సైజులో 228 పేజీలు. వెల. రూ. 5-00; ప్రచురణ: జూలై 1975; ప్రతులకు: స్వాతి పబ్లికేషన్స్, ప్రకాశం రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ - 520002]

"ఈ నవలలో ఒక సగటు కుటుంబంలోని స్త్రీ జీవితాన్నీ—కష్టాలనూ, సమస్యలనూ చిత్రించుతూ — కొంత క్రొత్త తరహా పరిష్కారాన్ని సూచించుతూ, మరలా ఆ నూతన పంథాలో గల ముళ్ళు కూడా ఎలా గుచ్చుకుంటాయో చూపడానికి ప్రయత్నించాను!" అన్నారు రచయిత్రి తమ 'ఒక మాట'లో.

అరవింద కలవారి యింటి ఆడపడుచు. బోలెడంత కట్నం పోసి ఆమెను సుధాకర్ అనే అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారు. ఆ పెళ్ళి జరిగిన తర్వాత సుధాకర్ పై చదువులకు 'స్టేట్స్' వెడతాడు. వెళ్ళిన వాడు మరో భార్యతో, ఇద్దరు పిల్లలతో తిరిగి వచ్చాడు. ఈ విషయం తెలిసి అరవింద తల్లిదండ్రులూ, అన్నయ్య ఆమెను వెంటబెట్టుకొని సుధాకర్ ఇంటికి వెడతారు. అక్కడ వాళ్ళకు పరాభవం కలుగుతుంది. చివరికి అరవింద సుధాకర్ నుంచి విడాకులు పొందుతుంది. ఆమె అన్నయ్య స్నేహితుడు ప్రభాకర్ విశాల హృదయంతో ఆమెను పెళ్ళిచేసుకుంటాడు. అయితే ఆమె కష్టాలు అక్కడితో ఆగిపోలేదు. అనుమానాలు, అవమానాలు అన్నీ కలిసి చివరికి అరవిందను బలి తీసుకుంటాయి.

ఈ నవలలోని కొన్ని పాత్రలు ఏ మాత్రమూ మానవత లేకుండా ప్రవర్తిస్తాయి. ఇందువల్ల ఆ పాత్రల చిత్రణ దెబ్బ తిన్నట్టు అనిపిస్తుంది. నవల చివర నవల పేరు సార్థకం చెయ్యడానికి ఒక పెద్ద పేరా వ్రాసినా, 'సూర్యముఖి' అన్న పేరు పెట్టడం ఎందుకో స్పష్టంగాలేదు.

## కొత్త నిజం

[కథలు]

[రచన: రాజీవ; ప్రచురణ: రజనీ ప్రచురణలు, రాష్ట్రపతిరోడ్డు, నిజామాబాద్. వెల: రూ. 5 లు; డెమ్మీసైజులో 120 పేజీలు; ఏక వర్ణ ముఖచిత్రం: చంద్ర]

ఈ కథల సంపుటిలో పది కథలున్నాయి. దాదాపు కథలన్నీ ఒకే ఇతివృత్తాన్ని ఆధారంగా తీసుకుని నడిచినవే. ఐతే, కథా కథనంలో మాత్రం కొంత వైవిధ్యం కనిపిస్తుంది. కథలన్నీ 'సీరియస్ మూడ్'లోనే నడుస్తాయి. "సంప్రదాయం అనే కృత్రిమ మూఢ నమ్మకపు ముసుగుల్లో, భూమిలోకి క్రుంగిపోయి, క్రింది చూపు తప్ప, కండ్లెత్తి ఈ విశాల విశ్వంలోకి సూటిగా చూడలేని, చూసి, స్థిరంగా వ్యక్తిత్వం నిలుపుకుని, నిలబడలేని— ఈ దేశ సమాజంలోని స్త్రీ—సాధారణంగా నా కథల్లోని పాత్ర" అని రచయిత్రి చెప్పుకున్నారు కాబట్టి, అలాంటి పాత్రే దాదాపు ఈ కథలన్నింట్లోనూ కనిపిస్తుంది.

ఈ పుస్తకానికి వాడిన కాగితం మీదా, అచ్చయిన అక్షరాల మీదా మరికొంత శ్రద్ధ చూపించి వుంటే- ఐదు రూపాయలు పెట్టి పుస్తకం కొనేవాళ్ళు కొంతయినా తృప్తి పడతారు!

**['పుస్తకాలు' శీర్షికలో సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు ఒక్క ప్రతిని పంపితే చాలు. ఆ పుస్తకాల ప్రచురణ మాత్రం ఈ సంవత్సరంలోనే జరిగి ఉండాలి; అవీ స్త్రీల రచనలే అయి ఉండాలి.]**